www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 19 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య

మ్యాప్ రీడింగ్ పోటీలో 'మిట్స్' విద్యార్థికి బంగారు పతకం

రేవంత్‌ను అభినందిస్తున్న విజయభాస్కర్

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి కె.రేవంత్ కుమార్ మ్యాప్ రీడింగ్ పోటీలో బంగారు పతకం సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్ (ఎఐటిఎస్‌సి-2024)లో ప్రతిభ చూపాడని అన్నారు. ఎపి,తెలంగాణ రాష్ట్రాల నుంచి 91 మంది క్యాడెట్లతో కూడిన డైరెక్టరేట్ పోటీదారులు అద్భుతమైన ప్రదర్శన చేసారని, అందులో మిట్స్ ఎన్‌సిసి విద్యార్థి భాగస్వామి అవ్వడం గర్వంగా ఉందని అన్నారు. వరుసగా పది క్యాంపుల్లో పాల్గొని ఈ ఘనత సాధించిన రేవంత్‌కుమార్‌ను అతని తల్లిదండ్రులు కె.రవీంద్ర, కళావతి కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ అభినంధించారు.

కౌలు రైతులకు ఊరట!

- 10 వేల మందికి గుర్తింపు కార్డులు
- రబీ నుంచి పంపిణీ చేయాలని ఆదేశం
- మండల వ్యవసాయ అధికారులకు బాధ్యత
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

జిల్లాలోని కౌలు రైతులకు ఊరట లభించనుంది. బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో కౌలురైతులకు గుర్తింపుకార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. జిల్లాలోని సుమారు 40 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్లు తెలిపింది. రెవెన్యూ అధికారుల స్థానంలో నుంచి మండల వ్యవసాయ అధికారులు ధ్రువీకరణ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతిఏటా కౌలురైతులకు గుర్తింపు కార్డులు లభించకపోవడంతో వ్యవసాయ రుణాల లభ్యతకు వేలాది మంది కౌలు రైతులకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. మంత్రివర్గం ఈఏడాది రబీ నుంచి కౌలురైతులకు గుర్తింపుకార్డులు అందజేయాలని నిర్ణయించింది.

జిల్లాలో 40 వేల మంది కౌలురైతులు ఉన్నట్లు అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యవసాయ 10 వేల మంది కౌలురైతుల్లో 7,132 మందికి గుర్తింపుకార్డులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈలెక్కన జిల్లాలో నాలుగింట ఒక వంతు కౌలు రైతులకు సైతం గుర్తింపుకార్డులు అందని పరిస్థితి కనిపిస్తోంది. తాజా కేబినెట్ భేటీలో కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని నిర్ణ యించిన నేపథ్యంలో కౌలురైతులకు వ్యవసాయ రుణాల అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో రబీ సీజన్ సమయానికి కొత్త గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించింది. కడప జిల్లాలోని 36 మండలాల, అన్నమయ్య జిల్లాలోని 30 మండలాలకు చెందిన వ్యవ సాయ అధికారులు సుమారు 43 వేల మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేయాల్సి ఉంది. రెవెన్యూ అధికారుల నుంచి మండల వ్యవసాయ అధికారులకు గుర్తింపు కార్డుల పంపిణీ బాధ్యతలు దఖలు పడిన నేపథ్యంలో ఆచరణలో ఎంతమంది కౌలురై తులకు గుర్తింపుకార్డులు లభించనున్నాయో వేచిచూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పిఓ) బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం మదనపల్లి సిఎల్‌ఆర్‌సి భవనంలో ఏపీ మాస్ సిఇఒ సిఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎం-టమోటో వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ (ఏపీ మాస్) వారి 6వ వార్షికోత్సవ మహాసభ జరిగింది. ఈ సభలో ఎన్‌ఐఆర్‌డి మాజీ డీజీ డబ్ల్యూ.ఆర్.రెడ్డితోపాటు కలెక్టర్ శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వద్దనున్న వనరుల్ని వృథా చేయకుండా సమర్థవంతంగా వినియోగించుకునే వారికి ప్రభుత్వ సహాయం ఉంటుందన్నారు. 2047 నాటికల్లా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉండాలన్న లక్ష్యంతో, విజన్‌తో ముఖ్యమంత్రి ముందుకు వెళ్తున్నారన్నారు. ముఖ్యమంత్రి సూచనతో వంద రోజుల ప్రణాళికతో అన్నమయ్య జిల్లా అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ముందుకు వెళుతోందన్నారు. అన్నమయ్య జిల్లా వెనుకబడిన, వర్షాభావం గల ప్రాంతం. నీటి కొరత అధికంగా ఉంటుంది. దాన్ని అధిగమించాలన్నారు. మన దగ్గర మానవ వనరులు ఉన్నాయని తెలిపారు. చదువుకున్న యువత ఉన్నారు. వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. వర్షాభావం ఉన్నప్పటికీ ఉద్యాన పంటలు కూడా పండిస్తున్నాం. టమోటాకి మదనపల్లి ప్రసిద్ధి. దేశంలో చెప్పుకోదగ్గ మార్కెట్లో ఇది ఒకటి. ఇక్కడ ఉత్పత్తిని బట్టి మన టమోటాకు రేటు నిర్ణయించబడుతుంది. అనుకూలాన్ని బట్టి అత్యధిక ధర వస్తుంది. ఒక్కోసారి తక్కువ ధర వస్తుంది. ఢిల్లీలో కిలో రూ.30, 40 ఉంటే ఇక్కడ రూ.5, 6లు మాత్రమే ధర ఉంటుంది. రైల్వేస్‌తో ఒక ఎంఒయు తీసుకుంటే మన ఉత్పత్తిని నేరుగా ఢిల్లీ మార్కెట్‌కు పంపవచ్చు. ఆ దిశగా ఎఫ్‌పిఒలు ఒక చొరువను తీసుకుంటే అందరూ అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. ఎవరికి పడితే వారికి లైసెన్సులు అందితే నాణ్యమైన విత్తనాలు కాకుండా నాసిరకం విత్తనాలతో ఆరుగాలము శ్రమించే రైతు నష్టపోతాడన్నారు. ఫర్టిలైజర్స్, సీడ్ లైసెన్సుల జారీలో అటు రైతులు ఇటు ఎఫ్‌పిఒలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ సహాయ సహకారాలను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించుకోవాలన్నారు. అధిక దిగుబడులు వచ్చే పంటలు వేస్తేనే రైతులు ముందుకు వస్తారని తెలిపారు. ఆహార శుద్ధిని లాభదాయకతను దృష్టిలో పెట్టుకొని మరింత ముందుకు వెళ్లాలని చెప్పారు. 18 వేల మంది సభ్యులు ఉన్న ఈ టమోటా వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ బాగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం నూతన విధానాలను అవలంబిస్తోందన్నారు. ఉత్పత్తిదారులు, మధ్యవర్తులకు ఉన్న వ్యత్యాసాలను గుర్తించి మన నాణ్యమైన ఉత్పత్తులను ఎక్కువ మందికి ఎలా చేర్చాలి, నష్టపోకుండా అమ్మకం ధరను ఎలా పొందాలి అన్న విషయాలపై సమిష్టిగా ఆలోచన చేయాలని పేర్కొన్నారు. ఎన్‌ఐఆర్‌డి మాజీ డిజిడబ్ల్యూ.ఆర్.రెడ్డి మాట్లాడుతూ రైతులందరిలో ఈ సంస్థ నాది అనే మనోభావం వస్తే ఎం-టమోటా వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ ఒక కార్పొరేట్ సంస్థగా ఎదిగే అవకాశం ఉందన్నారు. పూర్తిగా ప్రభుత్వ రాయతీల కోసం కాకుండా స్వశక్తితో ఎదగడానికి కృషి చేయాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన పశుసంవర్ధక సంస్థలు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా శాఖల ద్వారా అందించే ఇన్ పుట్స్‌ను వినియోగించుకోగలగాలన్నారు. బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎఫ్‌పిఒలో భాగస్వాములైన రైతులు సంస్థ పరంగానే కాకుండా ఒకకుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలు వేసుకోవాలని కోరారు. ఏపీ మాస్ సిఇఒ సిఎస్ రెడ్డి మాట్లాడుతూ రైతు బాగుపడాలి, ఆదాయం పెరగాలన్నారు. ఎఫ్‌పిఒలను ప్రభుత్వం సపోర్టు చేయగలిగితే మరింతగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ప్రభుత్వ సంబంధిత శాఖల అధికారులందరూ ఎఫ్‌పిఒలతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకునేలా నిర్వాహక సంస్థలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించడం కూడా జరుగుతోందని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ మెగా స్వరూప్ మాట్లాడుతూ ఎఫ్‌బిఒలకు అన్ని విధాల కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇబ్బందులు ఏవైనా వచ్చిన అధికారులు అండగా ఉంటారని తెలిపారు. సంస్థ లక్ష్యాలను అందిపుచ్చుకొని రైతులందరూ భాగస్వాములై అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. అంతకు ముందుగా రైతు సభ్యులు తమ అభిప్రాయాలను, సూచనలను సమావేశంలో వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రచార కరపత్రాలను సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, ఉపాధి హామీ, పిఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి వెంకటరమణ

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

- వైస్ ఎంపిపి వెంకటరమణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని వైస్ ఎంపిపి వెంకట్రమణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ మండల అభివృద్దే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామన్నారు. మండలంలో జ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మనోహర రాజు, జడ్‌పిటిసి నిర్మల, ఎస్ఐ శ్రీహరి, ఇఒ ఉదయ్ కుమార్, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఉచిత దంత పరీక్షలు

- అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆపిల్ డెంటల్ వైద్య నిపుణులు ఎపి సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులకు రెండు పర్యాయములు ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత వైద్య సేవలను అందించారని రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాల కృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక ఆపిల్ డెంటల్ హాస్పెటల్‌లో వైద్య నిపుణులు ఎన్.మునిగోపాల కృష్ణతోపాటు పలువురుకి ఉచిత దంత చికిత్సలు అందించారు. డాక్టర్ నిఖిత, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ భావనారెడ్డి చక్కటి దంత వైద్య చికిత్సలందించారని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లకు, ఇహెచ్‌సి వున్న వారికి చక్కటి సేవలందిస్తున్నారని మునిగోపాల కృష్ణ పేర్కొన్నారు. విజయవాడలో డాక్టర్ పార్థసారథి, డాక్టర్ భవాణిలు సేవలందిస్తున్నారని తెలిపారు. వారికి సీనియర్స్ సిటిజన్స్ తరపున ధన్యవాదములు తెలిపారు. ఈ సేవలను ఇహెచ్‌సి ఉన్న వారు, సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

324 క్వింటాళ్ల ఉలవలు మంజూరు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రత్యామ్నాయ పంట పథకం ద్వారా 80 శాతం రాయితీపైన 324 క్వింటాళ్ల ఉలవలు, విత్తనం మదనపల్లి మండలానికి కేటాయించారని మదనపల్లి వ్యవసాయ అధికారి నాగప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అల్ప వర్షపాతం వలన పంటల సాగు తక్కువుగా వున్నందున, పంట సాగు పెంచేందుకు ఈ విత్తనాలను ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు అందజేయబడునని తెలిపారు. అవసరమైన రైతులు ముందుగా తమ వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రం నందు పేర్లు నమోదు చేసుకోవలని కోరారు. ఎకరాకు 10 కిలోల చొప్పున,10 కిలోల బస్తా ధర రాయితీ మినహాయించి రైతు రూ.174గా చెల్లించాలని నిర్ణయించబడిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీ కార్మికులు అనుకూలంగా హైకోర్టు తీర్పును అమలు చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులు, రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య తెలిపారు. బుధవారం ఆయన కార్మిక నాయకులతో కలిసి బుధవారం చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రామ పంచాయతీ కార్మికులకు హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి హైకోర్టు ఆర్డర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సురేంద్రబాబు, వి.రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణం, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందప్ప, మదనపల్లి రూరల్ మండల అధ్యక్షులు డి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎం.నాగరాజు, చిత్తూరు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, సిపిఎం జిల్లా అధ్యక్షులు వాడా గంగరాజు, పంచాయతీ కార్మికులు అంజమ్మ, వీరప్ప, శ్రీనివాసులు, వెంగమ్మ పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నేటి నుంచి ఇసుక రిజిస్ట్రేషన్లు!

- శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ సిద్ధం?
- సాంకేతిక సమస్యలతో అధికారుల ఫీట్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాల్లో ఇసుక రిజిస్ట్రేషన్లకు సర్వం సిద్ధమైంది. అన్నమయ్య, కడప జిల్లాల మైనింగ్ యంత్రాంగం ఎపి శాండ్ మేనే జ్‌మెంట్ పోర్టల్‌ను సిద్ధం చేసే పనిలో నిగమ్నమయ్యాయి. గురువారం మధ్యాహ్నం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. ఉభయ జిల్లాల మైనింగ్ యంత్రాంగం ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ పోర్ట ల్‌ను ప్రారంభించ నున్నట్లు తెలుస్తోంది. ఇందులో అన్నమయ్య జిల్లాలో పోర్టల్ ఏర్పాట్లు కొలిక్కి వచ్చినప్పటికీ, కడప జిల్లాలో పోర్టల్ ఏర్పాటు వ్యవహారం రాత్రి ఏడు గంటల వరకు కొలిక్కి రాకపోవడం గమనార్హం. దీనికితోడు కడప, అన్నమయ్య జిల్లాల్లో శాండ్ మేనేజ్ మెంట్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు నెలకొనడంతో మైనింగ్ యంత్రాంగం ఫీట్లు చేస్తోంది. ట్రాన్స్‌పోర్టేషన్ ఎన్‌ప్యానల్‌మెంట్ ఎడతెగని వ్యవ హార ంగా మారింది. అన్నమయ్య జిల్లాలో 20 మంది ట్రాన్స్‌పోర్టేషన్లు, కడప జిల్లాలో సుమారు 10 మంది ట్రాన్స్‌పోర్టేషనర్లు అందుబాటులో ఉన్నట్లు సమాచారం. అన్నమయ్య జిల్లాలో రాజంపేట మండలం ఆర్.బుడగుంటపల్లి ఇసుక రీచ్ నుంచి మాత్రమే పోర్టల్ రిజిస్ట్రేషన్ల ద్వారా ఇసుక సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాటు చేసింది. 2.28 లక్షల టన్నుల ఇసుకను సిద్ధం చేయడం గమనార్హం. ఇదే తరహాలో కడప జిల్లాలోని రైల్వేకొండాపురం మండల పరిధిలోని రెండు ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో 40 వేల టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉంది. గురువారం మధ్నాహ్నం మూడు గంటల సమయానికి పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలతోపాటు ట్రాన్స్ పోర్టేషన్ ఎంప్యానల్‌మెంట్ సహా ఆన్‌లైన్ ఇసుక సరఫరా వ్యవ హారాన్ని కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నంలో జిల్లా మైనింగ్ అధికార యంత్రాంగం నిమగ్నమై ఉండడం గమనార్హం.

సాగునీటికి శాశ్వత పరిష్కారం చూపండి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి నియోజకవర్గ రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపియం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు పేర్కొ న్నారు. బుధవారం స్థానిక సిపిఎం శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ 2014 నుంచి 2024 వరకు టిడిపి, వైసిపిలు నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించడంలో విఫలం అయ్యారని తెలిపారు. హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల నిర్మాణాలను గాలికొదిలేసి వ్యక్తిగత విమర్శలు చేసుకుంటూ రైతులను విస్మరించారని అన్నారు. వెలిగల్లు నీరు వృథాగా వదిలేస్తున్నారే తప్ప మండిపల్లి రిజర్వాయర్, గంగనేరు ఇంక నియోజకవర్గం లోని చెరువులను నీటితో నింపాలన్నారు. ఝరికోన కింద పంట కాల్వలు పూడిక తీయాలని అన్నారు. నికర కృష్ణా జలాలు లేదా మిగులు జలాలు తెచ్చుకోవడంలో చిత్తశుద్ధి లేదన్నాని విమర్శించారు. గండికోట నీళ్ల తెస్తా మని, టన్నెల్ పనులు ఆటంకం అంటూ చెబుతారే తప్ప నిధులు కేటాయించి పెండింగ్ పనులు పూర్తి చేయక పోవడం వలన సాగునీరు లేక ఉన్న బోర్లు ఎండిపోయి పంట చేతికి రాక రైతులు నష్టపోవడమే గాక ఆహారభద్రత ఏర్పడి ధరలు పెరగడానికి పాలకుల విధానాలు కారణం అవుతున్నాయని తెలిపారు. రైతుల తరుపున భవిష్యత్‌లో సాగునీరు కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన బాట పడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగబసిరెడ్డి, శివరాం, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందాం

- వైసిపి జిల్లా అధ్యక్షులు 'ఆకేపాటి', ఎంపీ మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

విశ్వసనీయత, విలువలు, సిద్ధాంతాలతో ప్రజా క్షేత్రంలో పురుడుపోసుకున్న వైసిపిని సమిష్టి కృషితోబలోపేతం చేసుకుందామని వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణం బోస్ నగర్‌లో నూతన పార్టీ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, అధికార ప్రతినిధి రమేష్ కుమార్‌రెడ్డి, మదనపల్లె ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా తోడుగా ఉంటామన్నారు. ఎన్నికల అనంతరం తొలిసారిగా రాయచోటిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, స్వచ్ఛందంగా పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరావడం హర్షదాయకమన్నారు. పార్టీని కొంత మంది స్వార్థపరులు వదలడం మంచి పరిణామమన్నారు. జిల్లాలోని నాయకులందరమూ సమిష్టిగా కలసి కార్యకర్తల, నాయకుల కష్టనష్టాలలో తోడుగా నిలుస్తామన్నారు. ఆకేపాటి మాట్లాడుతూ జిల్లాలోని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు సమిష్టిగా కార్యకర్తల కష్టాలలో పాలుపంచుకుంటామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజలను మోసగించారని, అదే జగన్ ప్రభుత్వం ఉంటే ఇప్పటికే ఎన్నో పథకాలు అందేవని ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు చెపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలే ఊపిరిగా, ప్రాణం ఉన్నంత వరకూ ప్రజా సేవ చేస్తూనే ఉంటానని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి కానీ, ప్రశాంతతకు ఎల్లవేళలా తాను సహకరిస్తామన్నారు. ప్రతిపక్ష పాత్రను పటిష్టంగా పోషిస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉంటామన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, అక్కచెల్లమ్మలకు రూ.15 వేల నిధులు తదితర హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్రీహోల్డ్ భూములపై పూర్తిగా అవగాహన లేకుండా అధికార పార్టీ నేతలు మాట్లాడుచున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వందరోజుల పాలన మోసపూరితంగా సాగిందన్నారు. చెప్పిన హామీ మేరకు రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయానికి భవనాన్ని ఇచ్చిన అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డికి శ్రీకాంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. రమేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఖజానా ఖాళీగా ఉందని భయమేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు తెలీదా అని ప్రశ్నించారు. చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు తన వంద రోజుల పాలనలో జనాదరణను కోల్పోయారన్నారు. ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి ఆరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నడుపుచున్నారా లేక ప్రయివేట్ ట్రస్ట్ నడుపుచున్నారా అని ప్రశ్నించారు.

నూతన బోరుకు భూమిపూజ

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు టిడిపి యువ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంబేపల్లి మండలం సంబేపల్లిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఆయన నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 90 రోజులలోనే నియోజకవర్గంలో దాదాపు 58 బోర్లు వేశామని పేర్కొన్నారు. ప్రజల కోరిక మేరకు ఎక్కడ నీటి సమస్య ఉన్న పరిష్కరించేందుకు ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో నియోజకవర్గంలో నీరు, డ్రైనేజీ, కరెంటు తదితర సమస్యలను పరిష్కరించి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉత్తమ ప్రతిభ కనబరిచిన కురబ సామాజిక వర్గ విద్యార్థులకు సన్మానం చేయనున్నట్లు కురుబ సంఘ సామాజిక సేవా సొసైటీ నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందఠరేగా డివిజన్ అధ్యక్షులు ఆర్కే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మర్రిపాటి రమేష్ లు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేయడం జరుగుతుందన్నారు. 10వ తరగతిలో 500 పైబడి, ఇంటర్లో 900 పై బడి మార్కులు సాధించిన విద్యార్థులు, జేఈఈ, మెయిన్స్, నీట్ ఇతరత్రా పోటీ పరీక్షల్లో సీటు సంపాదించిన వారు తమ వివరాలను సొసైటీకి తెలియజేయాలన్నారు. దరఖాస్తు ఫారమ్ కావాల్సిన వారు జనరల్ సెక్రెటరీ మర్రిపాటి రమేష్ (9494742225) సంప్రదించాలని తెలిపారు. దసరా సెలవుల్లో వేదికను నిర?యిస్తామని, ఆ వేదికలో విద్యార్థులను గౌరవించి, సన్మానంతో పాటు బహుమతి ప్రధానం చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కురబ సామాజిక వర్గ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కురువ సంఘ నాయకులు బత్తిని రెడ్డప్ప, బండి రెడ్డప్ప, డి నరసింహులు, రెడ్డి కుమార్, ఆంజనేయులు, బాలక ృష?, గుడే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ముస్లిం కమిటీ సభ్యులు

వక్ఫ్ బిల్లును అడ్డుకోవాలని ఎంపీకి వినతి

ప్రజాశక్తి-పీలేరు

ముస్లిం సమాజానికి నష్టం కలిగించే వక్ఫ్ బిల్లును పార్లమెంటులో అడ్డుకోవాలని అహలియా సున్నత్-ఉల్-జమాత్ ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు ఎంపీతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వక్ఫ్ సవరణ బిల్లు వలన ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. సహ పార్లమెంటు సభ్యుల మద్దతుతో లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుకు అనుమతి రాకుండా అడ్డుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, ఇబ్రహీం, ఎస్.కె. ఖాదర్, ఎస్.అబ్దుల్ రెహమాన్, మస్తాన్, పి.ఖాన్, కెఎస్‌ఎం అలీ పాల్గొన్నారు.

24న విభిన్న ప్రతిభావంతుల సహాయ పరికరాల శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈనెల 24వ తేదీన మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు షేక్ అబ్దుల్‌ఖాదర్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు వారికి కావలసిన పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఈ శిబిరానికి హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, యుడిఐడి కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలని సూచించారు. ఈ శిబిరం జిల్లా సంక్షేమ సంచాలకుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం ఉపాధ్యక్షులు బాషా, సభ్యులు వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ కృష్ణయ్య

ప్రాథమిక పాఠశాలకు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని గడికోట పంచాయతీ వేల్పులమిట్ట ప్రాథమిక పాఠశాలకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వేల్పుల విజయకుమార్ వారి తల్లిదండ్రులు సిద్ధమ్మ, నాగయ్య, జ్ఞాపకార్థం పాఠశాలకు గ్యాస్‌స్టవ్, ఆరు కుర్చీలను ఎంఇఒ కృష్ణయ్య చేతుల మీదుగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విజయ్‌కుమార్ ప్రతి సంవత్సరం పాఠశాలకు తోడ్పా టు అందిస్తున్న విద్యార్థులకు అవసరమైన వస్తు సామగ్రిని అందిస్తున్నారని అన్నారు. ఇలాంటి దాతలను మరి కొందరు ఆదర్శంగా తీసుకొని విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటును అంది వ్వాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ లక్ష్మీదేవి, ప్రధానో పాధ్యాయులు బాలాజీరాజు, పిఎంసి సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ అధికారికం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్ర ప్రభుత్వం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును అధికారిక ఆత్మార్పణ రోజుగా ప్రకటించడం హర్షించ దగ్గ విషయమని రైల్వేకోడూరు శ్రీఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి చలపాటి హరినాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ రోజును ప్రభుత్వం అధికారంగా ప్రకటించి జిఒ విడుదల చేసినందుకు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌పిని సన్మానిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

టిడిపి నాయకులపై ఎస్‌పికి ఎంపిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-నందలూరు

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అతని అనుచరులతో ఈనెల 4న ఎంపిడిఒ కార్యాలయంలోఅనుమతి లేకుండా తన చాంబర్‌లోకి ప్రవేశించి వ్యక్తి పత్రాలను తీసుకెళ్లారని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి బుధవారం ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు కలిసి ఫిర్యాదు చేశారు. 6వ తుదీరి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధికార పార్టీ ప్రతి నిధినంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేసి ఎంపీపీ చాంబర్లోకి వెళ్లి ప్రోటోకాల్ లేనప్పటికీ తాము చెప్పిన పనులే చేయాలంటూ అధికారులను బెదిరిం చారని అన్నారు. ఎంపిపికి సంబంధించిన వ్యక్తిగత పత్రాలను తస్కరించారని పేర్కొన్నారు. మేడా విజయ శేఖర్‌రెడ్డి అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌పిని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్‌పి స్పందిస్తూ విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లాఖాన్, ఎంపిటిసిలు ఆకేపాటి రమేష్‌రెడ్డి, సుభాన్ బాషా, వైసిపి నాయకులు తుమ్మల శ్రీధర్, సోమిశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు చెక్కును అందజేస్తున్న రమణారెడ్డి

వరద బాధితులకు రూ.11 లక్షలు సాయం

ప్రజాశక్తి-మదనపల్లి

ఇటీవల విజయవాడతో పాటు వరదకు గురైన ప్రాంతాలకు మూడు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల తరపున గోల్డెన్ వ్యాలీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్ రాయలసీమ జోన్ సెక్రటరీ ఎన్‌వి. రమణారెడ్డి రూ. 11 లక్షల చెక్కను మంత్రి నారా లోకేష్‌కు అందించారు. ఉండవల్లిలో లోకేష్‌ను కలిసచెక్కును అందించినట్లు రమణారెడ్డి తెలిపారు. అసోసియేషన్ తరుపున రూ.6కోట్లు ఆర్థిక సాయం చేశామన్నారు.

20న వేంపల్లెలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో 38వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ (సబ్ జూనియర్స్) పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ తరుపున ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుండి క్రీడాకారులు వస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

షాపుల్లో వైద్యం చేస్తున్నారని డిఐ ఆగ్రహం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పలు మందుల షాపుల్లోనే వైద్యం చేస్తున్నారని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (డిఐ) మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మందుల షాపులపై బుధవారం మాధవి తన బృందంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల లైసెన్స్, రికార్డులను పరిశీలించారు. డిఐ దాడులు చేస్తున్న విషయం తెలుసుకున్న పలు మందుల షాపుల వారు మూసేశారు.

మహారాజశ్రీ కడప 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.NO :1061/2023

సిపిరి శ్రీదేవి అలియాస్ కొత్తవాండ్ల శ్రీదేవి భర్త వెంకట సురేంద్ర నాథ్, తండ్రి కొత్తవాండ్ల సుబ్బరాయుడు, డోర్ నెం. 6/25, విజయ సాగర్ నగర్, ఆడపూరు గ్రామం, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

V/s

సిపిరి వెంకట సురేంద్రనాథ్, తండ్రి వెంకటసుబ్బయ్య, డోర్ నెం. 1/14, అక్కాయపల్లె (V&P), కడప జిల్లా. ...ప్రతివాది

వాది, ప్రతివాది నుండి రావాల్సిన భరణము చెల్లించమని కోరుతూ మరియు దావా ఆస్థిపై క్రయ, విక్రయములు జరపకుండా ఉండుటకు గాను గౌరవ రాజశ్రీ కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు విషయమై మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల 24-09-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, లేక మీ వకీలు ద్వారా గాని హాజరై మనవి చేసుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

//By order of the Court//

పి. వల్లభరావు,
వాదిపరం వకీలు,
రాజంపేట.

మహారాజశ్రీ కడప 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.NO : 664/2023

O.S. NO :1061/2023

సిపిరి శ్రీదేవి అలియాస్ కొత్తవాండ్ల శ్రీదేవి భర్త వెంకట సురేంద్ర నాథ్, తండ్రి కొత్తవాండ్ల సుబ్బరాయుడు, డోర్ నెం. 6/25, విజయ సాగర్ నగర్, ఆడపూరు గ్రామం, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్/వాది

V/s

సిపిరి వెంకట సురేంద్రనాథ్, తండ్రి వెంకటసుబ్బయ్య, డోర్ నెం. 1/14, అక్కాయపల్లె (V&P), కడప జిల్లా. ...రెస్పాండెంట్ /ప్రతివాది

పిటీషనర్, రెస్పాండెంట్ పైన షెడ్యూల్ దాఖలా ఆస్తిని ఎలాంటి పరాధీనము చేయకూడదని పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు విషయమై మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల 24-09-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, లేక మీ వకీలు ద్వారా గాని హాజరై మనవి చేసుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

//By order of the Court//

పి. వల్లభరావు,
పిటీషనర్ పరం వకీలు,
రాజంపేట.

జాతిపిత అడుగుజాడల్లో నడుద్దాం : డిపిఒ

మదనపల్లి : మాట్లాడుతున్న డిపిఒ ధనలక్ష్మి

ప్రజాశక్తి-మదనపల్లి

జాతిపిత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో అందరం నడుద్దామని డిపిఒ ధనలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల పేర్కొన్నారు. స్వేచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 2కె రన్‌ను మున్సిపల్ కార్యాలయం నుంచి అమూల్ పాల డైరి వరకు నిర్వహించినట్లు తెలిపారు. స్వచ్ఛత భగీరథ చిత్తూరు బస్టాండు, తారకరామ థియేటర్, బెంగుళూరు బస్టాండు, అనంతయ్య బంగ్లా వద్ద ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ చల్లిండం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు మున్సిపల్ టౌన్ హాల్లో సఫాయి మిత్ర షేవియర్ కార్యక్రమంలో భాగంగా సంఘ కార్మికులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించి వైద సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమానికి డిఎల్‌డిఒ వి.లక్ష్మిపతి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.హరి కృష్ణ, మునిసిపల్ అర్బన్ వైద్యులు, సఫాయి మిత్రలు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

లక్కిరెడ్డిపల్లి :మండలంలోని మద్దిరేవుల ఎర్రగుడి లక్కిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు నేతృత్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి సర్పంచ్ అహల్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ శుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నార. బ్రాహ్మణ ఎర్రగుడి గ్రామపంచాయతీలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతి ఒక్కరు శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి నాగమణి మండల అభివృద్ధి అధికారి వెంకటరమణారెడ్డి గ్రామపంచాయతీ సిబ్బందిపాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుస్తుందని సిహెచ్‌ఎస్‌ఐ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య తెలిపారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో పిచ్చిముక్కలు, గట్టి తొలగించి శుభ్రపరిచారు. అనంతరం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను స్పెషల్ ఆఫీసర్ డిఎల్‌పిఒ నాగరాజు పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు మురుగునీటి కాలువలు శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తంబళ్లపల్లి మండలాన్ని స్వచ్ఛత తంబళ్లపల్లిగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరి సహకారంతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమాలలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఈవోపీఆర్డీ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛత ,సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణ గురించి మండల ప్రత్యేక అధికారి విజయ మోహన్ పంచాయతీ కార్యదర్శులు,పంచాయతీ నోడల్ అధికారులతో సమీక్షించారు. అన్ని గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. **బి.కొత్తకోట :**పెద్దతిప్పసముద్రం మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో షెడ్యూల్ మేరకు ప్రత్యేక కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు అధికారులు సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. ప్రథమ చికిత్స ఎలా నిర్వహించాలనే అంశాల గురించి గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు. కందుకూరు, కాట్నగల్లు గ్రామపంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఎంపిడిఒ బాలాజీ, ఉపాధి హామీ ఎపిఒ తిరుపాలప్ప సందర్శించారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం

కలికిరి : శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని వైఎస్ ఎంపిపి గాయత్రిరెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండలి స్థాయి పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో ఆటలు , వ్యాయామం ఎంతో అవసరమని, శరీర సౌష్టానికి, మనోవికాసానికి ఆటలు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుతోపాటు ఆటల పోటీల్లో కూడా ప్రావీణ్యం సంపాదించి రాష్ట్ర దేశ స్థాయిలో తమ నైపుణ్యం ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమానికి ఎంఇఒ కరీముల్లా, సెర్పెంచ్ ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు శారద , వ్యాయామ ఉపాధ్యాయుడు టి.రెడ్డిమోహన్‌రెడ్డి, టిడిపి యువ నాయకుడు యోగేష్ రెడ్డి, ఆర్ముగం, రఘు, గీత, ముబారక్ పాల్గొన్నారు. **వీరబల్లి :** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు, ఐదు కిలోమీటర్ల పరుగు పందెం లో వద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యపరీక్షలు చేయించుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టి రోడ్లకు ఇరువైపులా నీటి కుంటలను పూడ్చడి, అపరిశుభ్రంగా ఉన్న రోడ్లను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో ఎపిఒ నాగరాజు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు ప్రజా ప్రతినిధులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్వచ్ఛత హే సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు రన్నింగ్ రేసు సైకిల్ రేస్ నిర్వహించారు. ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మెడికల్ క్యాంపు నిర్వహించి వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరపల్లి :పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామ ప్రజలు

పంట కోత ప్రయోగాలపై సిబ్బందికి శిక్షణ

పంట కోత ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను, సర్వే నెంబర్లను సరిచూసుకొని ఖచ్చితమైన వివరాలను ప్రభుత్వానికి అందించాలని మండల గణాంక అధికారి ఎం.జగన్నాథం తెలిపారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి మురళీ మోహ న్‌తో కలిసి వ్యవసాయ,అనుబంధ శాఖల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పంట కోత ప్రయో గాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సంవత్సరానికి గాను ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంట కోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చిన ట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వే నెంబర్‌లో గల పొలాలలోని రైతులు సాగు చేసిన పంటల వివరాలు, వాటి దిగుబడులను సకాలంలో ఖచ్చితమైన సమగ్ర వివరాలను ప్రభు త్వానికి నివేదిక రూపంలో అందించాలన్నారు. పంట దిగుబడి సమయంలో పంట కోత ప్రయోగాల్లో వచ్చిన సరాసరి దిగుబడుల ఆధారంగానే పంటల స్థూల ఉత్పత్తులు రాష్ట్ర స్థాయిలో లెక్కించడం జరుగుతుందన్నారు. వీటి ఆధారంగానే పంటల బీమా, ఇతర ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్రాల ఉద్యోగులు పంట కోతలు ఖచ్చితమైన వివరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఎఇఒ లక్ష్మీ ప్రసన్న, రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మినీ గురుకులంలో సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో గల గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్‌నదియాదేవి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో సిబ్బంది పనితీరు పట్ల ఆరా తీశారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సిపిఎం మండల కార్యదర్శిగా హరిప్రసాద్

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని వైకోట గ్రామంలో బుధవారం సిపిఎం శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శిగా చెన్నూరు హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. మహాసభల ప్రారంభం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం ప్రధాన కార్య దర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తామని అన్నారు.. వై కోట గ్రామంలో భూమిలేని కుటుంబాలకు రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని, శ్మశానానికి భూములు కేటాయించాలని, రోడ్లు మౌలిక వసతులు కల్పన కోసం అరటి, బొప్పాయి రైతు లకు మార్కెట్ సదుపాయాల కోసం భవిష్యత్తులో ఉద్యమాలు చేపడతామని పేర్కొ న్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేశవులు పాల్గొన్నారు.

పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా సిపిఎం సభ్యులు

రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపికైన విద్యార్థులతో పీడీ నీలకంఠేశ్వరరావు

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జాస్మిన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నీలకంఠేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఎస్‌జిఎఫ్ అండర్-19 ఫుట్ బాల్ పోటీలు వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ కడప లో జిల్లాస్థాయి పోటీలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జాస్మిన్ ఫుట్‌బాల్ విభాగంలో అద్భుత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలలో అర్హత సాధి ంచిందని, అక్టోబర్ పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల పీడీ నీలకంఠేశ్వరరావు, ప్రిన్సిపల్ లీలాశ్రీహరి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో కూడా అద్భుత ప్రతిభ కనబరిచిన కూడా పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఎరువుల డీలర్లు ప్రభుత్వం ప్రకటించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిగా ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం బుధవారం కొండాపురం వ్యవసాయ శాఖ అధికారి రామాంజనేయరెడ్డితో కలిసి సింహాద్రిపురం రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. వారిపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. నిషేధిత గడ్డి మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంట నమోదు చేసుకోవడానికి ఈనెల 23 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు.

రక్తనమూనాల సేకరణ

ప్రజాశక్తి - వేంపల్లె : మండలంలోని అమ్మగారిపల్లెలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అమ్మగారిపల్లెలో ఇంటింటా ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నమూనాలను సేకరించామన్నారు. లార్వా సర్వే చేశామ న్నారు. లార్వా ఉన్న ప్రదేశాల్లో అబేట్, దోమల నివారణకు సైఫనోత్రిన్ పిచికారి చేశామన్నారు.

సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంఇఒలు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-రామాపురం

మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను బుధవారం నీలకంఠరావుపేట జడ్‌పి హైస్కూల్‌లో ఎంఇఒలు రామకృష్ణుడు, జైచంద్ర ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలు పిచ్చి రెడ్డి మనోహర్, భూషణ్ రెడ్డి, వసుందర , అమృతవల్లి, రాణి, శ్రీరాములునాయక్, రెడ్డయ్యలకు శాలువా జ్ఞాపికతో ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో తెలుగు ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు సుజాత, హిలాల్ ఉపా ధ్యాయ సంఘ నాయకులు రామచంద్ర గోపికృష్ణ, వెంకటరామిరెడ్డి, విశ్వనాథ పాల్గొన్నారు.

పాఠశాల సముదాయ సమావేశంలోమాట్లాడుతున్న ఎంఇఒ

చేతి రాతపై శ్రద్ధ తీసుకోండి :ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్లో బుధవారం పాఠశాల సముదాయక సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఇఒ-1 చక్రధర్‌రాజు అన్ని సబ్జెక్టుల సమావే శాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హిందీ భాషోపాధ్యాయుల సమావేశంలో పలు సూచనలు చేశారు. విద్యార్థుల చేతి రాత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మంచి దస్తూరితో విద్యార్థులు మంచి మార్కులు పొందే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలను పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హిందీ ఆర్‌పిలు, సయ్యద్‌సర్తాజ్ హుస్సేన్, ఎల్.శ్రీనివాసులు, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నిమ్మనపల్లి బస్టాండ్ కూడలిలో వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు, ద్విచక్ర వాహనాలకు జరిమానాలను విధించారు. ద్విచక్ర వాహనదారులు త్రిబుల్ రైడ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బస్టాండ్‌లో విచ్చలవిడిగా ఆటోలను, ద్విచక్ర వాహనాలను నిలుపరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న జెడి చంద్రనాయక్

పంట నమోదు తప్పనిసరి : జెడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో పంటలు సాగు చేసిన రైతులు ఇ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని అప్పుడే ప్రభుత్వ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు. బుధవారం తంబళ్లపల్లి మండలంలో పర్యటించారు. చెవిటివారిపల్లె వద్ద వేరుశనగ పొలంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంట దిగుబడిని పరిశీలించారు. రైతులకు వేరుశెనగ పంట సాగులో మెలుకువలు, నాణ్యత అధిక దిగుబడి సాధించేందుకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మదనపల్లి ఎడిఎ శివశంకర్, ఎఒ రమణ, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-గాలివీడు : మండల పరిధిలోని అరవీడు గ్రామ పంచాయితీ శ్రీనగర్‌లో సంకర జాతి లేగ దూడల ప్రదర్శన, ఉచిత గర్భకోశ చికిత్సా కార్యక్రమాన్ని ఎపిఎల్‌డిఎ తరుపున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరవీడు గ్రామ పశు యజమానులు పాల్గొన్నారు. ఎంపిక చేసిన లేగదూడలలో మొదటి, రెండవ, మూడవ బహుమతులు ప్రదానం చేశారు. 38 పశువులకు వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎపిఎల్‌డిఎ డిడి డాక్టర్‌రమేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని చిట్లూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని పురం వెంకటరమణ (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు రామాపురం ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ కొత్తపల్లెకు చెందిన వెంకటరమణ ఆయన బామ్మర్ది లక్ష్మీనారాయణతో కలిసి గాలివీడు నుంచి మోటార్ బైక్‌లో వస్తూ ఉండగా చిట్లూరు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందని తెలిపారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటరమణ మృతి చెందగా, లక్ష్మీనారాయణ చికిత్స పొందుతున్నాడని అన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.